"అమ్మా!..." బిందు మాధవి పిలుపు విని నెమ్మదిగా ఓపిక చేసుకుని అటువైపు తల త్రిప్పి చూసింది స్వరూపిణి. మంచానికి ప్రక్కగా నిలబడి బిందు చేతిలో గ్లాసు పట్టుకునుంది.

ఎప్పట్నుంచి పిలుస్తోందో ఇప్పటికి మెలకువ వచ్చింది తనకు. తల త్రిప్పి కూతురి వైపు చూసింది కాని ఎక్కువసేపు చూపులు ఆమెవైపే నిలుపలేక పోయింది. మనసులో పేరుకుపోయి ఉన్న మాటలను పెదవి విప్పి పలికే ఓపిక ఆమెలో ఇపుఁడసలే లేదు.



# వసంతరాగం

మంజీరా



కథల పోటీలో కన్సొలేషన్

బహుమతి రూ.500/- పొందిన కథ



నటన

డైరెక్టర్: ఏమిటయ్యా ఆ యాక్షన్! విషం తిన్నట్లు నాచురల్‌గా నటించాలి!

హీరో: ఇంకా నాచురల్‌గా నటించాలంటే... నేను నిజమయిన విషం తినాల్సిందే సార్!

—గురు

కూతురి రూపం చూడాలని విశ్వప్రయత్నం చేస్తోంది కాని వార్ధక్యం వల్ల ఏర్పడిన గుడ్డితనానికి, సుడులు తిరుగుతూన్న కన్నీళ్ళుతోడై ఆ కాస్త రూపం కూడా కనిపించక మసకబారిపోతుంది. సన్నగా మూలిగి మళ్ళీ కళ్ళు మూసుకుంది.

"అమ్మా! పొద్దిట్నుంచి ఏమీ తీసుకోలేదు. కనీసం ఈ గ్లాకోజ్ నీళ్ళైనా తాగమ్మా.. ఓపికొస్తుందేమో !" జ్వరంగానీ ఉందేమోనని నుదురు మీద చెయ్యి వేసి చూస్తూ అంది. తల్లి బుగ్గలమీంచి జాలువారు తూన్న కన్నీటి ప్రవాహాన్ని పమిట కొంగుతో తుడిచింది.

బిందూ మంచంమీద ఒరగా కూర్చుని తల్లి తలను ఒక చేత్తో ఒడిసి పట్టుకుని మరో చేత్తో గ్లాకోజ్ నీళ్ళ గ్లాసును ఆమె నోటి దగ్గరుంచింది.

స్వరూపిణి తాగే ప్రయత్నం చేయక కూతురి మొఖంలోకి చూస్తూ అంది "జన్మ జన్మలకూ నీకు రుణపడి ఉంటాను తల్లీ!?"

తల్లి నోట్లో ఒకో గుక్కపోస్తూ అంది "నీకూ నాకు మధ్య ఈ రుణాలేమిటమ్మా? ఐనా నువ్వు తప్ప నాకెవరున్నారని?..."

నిజం! తను పోతే ఇక ఈమెకు దిక్కెవరు?

ఆ ఆలోచనే ఆమె గుండెను మరీ పిండి చేస్తోంది. గొంతు పొలమారింది. విపరీతంగా దగ్గొచ్చింది.

తల్లి గుండెలమీద చేత్తో రాస్తూ అంది "ఈ కాస్త నీళ్ళు కూడా తాగకపోతే ఎలాగమ్మా?..." బిందూ కళ్ళు చెమ్మగిల్లాయి. తనకు తెలుసు తన తల్లి జీవితం ఇక రోజుల్లోకొచ్చేసిందని. డాక్టరు కూడా ఆ విషయం రూఢీ చేశాడు. ఐనా ఎక్కడో మూల సన్నని ఆశ మెరుస్తోంది... తల్లి తనను ఒంటరిగా విడిచి వెళ్ళదని.

"పిచ్చిదానా!... ముసలిదాన్ని ఇంకెంత కాలం బతుకుతాను?... నా బెంగ నా గురించి కాదమ్మా?!.. నోట్లో గ్లాకోజ్ నీళ్ళు జారడంతో గుక్కమింగి మళ్ళీ అంది "నేను పోతే నీ బతుకేమౌతుందని?,, ఏంచేసి నీ భవిష్యత్తును చక్కదిద్దగలను;.. మంచాన్ని అంటిపెట్టుకుని ఇలా చావుకోసం ఎదురు చూస్తున్న నేను... నీకేం చేయగలను తల్లీ?..." దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఆయాసంగా ఒగిర్చింది.

"అమ్మా!?... ఎందుకూరికే మనసు పాడు చేసుకుంటావ్?... ఇప్పుడు నాకే మయిందని?... రేపో మాపో ఉద్యోగం వస్తుంది... మన జీవితం హాయిగా గడిచిపోతుంది!..." ఉబికి వస్తూన్న కన్నీళ్ళను ఆపుకోవాలని ప్రయత్నించింది.

"హాయి!... పేలవంగా నవ్వింది స్వరూపిణి.

"మీ నాన్నగారే బతికుంటే నాకింత దిగులుండేది కాదు... బాధ్యతలన్నీ నా కప్పచెప్పి చక్కాపోయారు... నా పరిస్థితేమో ఇలా ఉంది!..." చిన్నగా నిట్టూర్చింది.

"ఈ కష్టాలన్నిటికీ నేనేగా కారణం?... అసలు నన్నెందుకన్నావమ్మా?..." గ్లాసు ప్రక్క నుంచి పమిట కొంగులో తల్లి పెదాలు అద్దుతూ అంది.

"నీతో ఇలా సేవలు చేయించుకోడానికి తల్లీ!" కూతురి చేతిని తన చేతుల్లోకి తీసుకుంది ప్రేమగా.

"ఏ జన్మలోనో చేసుకున్న పాపం కాకపోతే... దేముళ్ళాంటి నాన్నను చేజేతులా చంపుకుంటానా?"

"పిచ్చితల్లీ!... చావు పుట్టుకలు మన చేతుల్లోనే ఉంటే ఇన్ని కష్టాలే ఉండవ్?!... ఓదారుస్తున్నట్లుగా ఆమె చేతి మీద తడుతూ అంది.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం రాజ్యం చేసింది.

మంచం క్రిందుంచిన వేన్నీళ్ళ పాత్రను అందుకుని మంచం పట్టీ మీదుంచింది. పల్చటి తుండు చివరను అందులో ముంచి, పిండి తల్లి ముఖం తుడవసాగింది. స్వరూపిణి తిరిగి ఆలోచనల్లో మునిగిపోయింది. తను చనిపోయే లోపల కూతురి భవిష్యత్తును ఎలా చక్కదిద్దగలనా అని దీర్ఘంగా ఆలోచిస్తోంది.

"నరేష్‌బాబుకు ఉత్తరం రాశావా?..." ఏదో గుర్తుకొచ్చినట్లైన్లు కూతురి ముఖంలోకి చూస్తూ అడిగింది.


"ఆ! రాశాను!...వారానికో ఉత్తరం రాస్తూనే ఉన్నాను' తల్లివైపు చూడకుండానే తలగడ సర్దుతూ అంది. ఎడ్రెస్ తెలియని మనిషికి ఎన్ని ఉత్తరాలు రాసినా ఏం ప్రయోజనం? రాసినా రాయకపోయినా ఒకటే! ఈ ప్రశ్న తన తల్లి కన్నీళ్ళ నుండి విసుగు విరామంలేకుండా అడగడం... తను ఇలా సమాధానం చెప్పడం మామూలే! తను అబద్ధం ఆడుతున్నా విషయం తల్లికి మాత్రం తెలియదనా? ఐనా అలా ఆశగా అడగడంలో ఆమెకు చెప్పలేని సంతృప్తి! ఆశే మనిషిని బతికించగలిగేది!

కూతురి మొహం లోకి చూసింది. కుందనపు బొమ్మలా కళకళలాడే బిందు మొఖం కనీసపు అలంకరణలు కూడా లేకుండా వెలవెల బోతూంది. జీవితంమీద విరక్తి మనిషిని ఈ స్థితికి దిగజారుస్తుంది కాబోలు!

"ఇంతసేపూ మాట్లాడి అలసిపోయావ్!... కాస్సేపు పడుకో!..." తల్లి ముంగురులు సవరిస్తూ కన్న తల్లిని మరిపింపజేసింది.

ఓ క్షణం తల్లి వంక దీక్షగా చూసి చేయవలసిన పనులు చాలా మిగిలిపోడంతో తల్లిని పడుకోమని చెప్పి తన పనుల్లో నిమగ్నమయింది.

* * *



"మనిషి బాగా పాడయారు... మీరు చెబితేనే కాని గుర్తు పట్టలేనంతగా మారిపోయారు!.." దీక్షగా మంచంమీద కట్టెలా పడిఉన్న స్వరూపిణి వంక చూస్తూ అన్నాడు.

అతను తన తండ్రి దగ్గర చదివిన ఒకప్పటి విద్యార్థట. స్వరూపిణి తనను ఆ రోజుల్లో కన్న తల్లి కన్నా ఎక్కువగా చూసుకునేదట. వారాలు చేసుకుంటూ చదువుకునే తనకు తనవంతు వచ్చినప్పుడు రుచికరమైన భోజనం అడిగడిగి మరీ వడ్డించేదట! తన పట్ల అంత అభిమానం చూపేదట!

బిందూ తల్లి దగ్గరగా వచ్చి చిన్నగా పిలిచింది.

"మగత నిద్రలో ఉన్నట్టున్నారు...లేపకండి!..." వొద్దన్నట్లు చూశాడు. ఆమె తన ప్రయత్నం విరమించింది.

"ఈ మధ్యే తెలిసింది...మాష్టారు పోయారని.. ఎప్పట్నుంచో అనుకున్నాను ఆయన్ను ఒకసారి చూడాలని.. ఆయన ఆశీర్వచనాలు పొందాలని.. ప్చ్! దురదృష్టవంతుణ్ణి... ఆయన కడసారి చూపుకు నోచుకోలేకపోయాను... నేను... ఈ స్థితికి రాగలిగానంటే అంతా మాష్టారి చలవే! ..." అతని గొంతు జీరబోయింది. గుండెలు బరువెక్కాయి.

అతను గతాన్ని గుర్తుచేస్తుంటే మంత్రించిన బొమ్మలా వింటోంది. ఓ అపరిచిత వ్యక్తి ముందు అలా అంతసేపు నిలబడడం ఆమెకు ఇబ్బందిగానే ఉంది.

అతను ఆఫీసు పనిమీద ఈ ఊరు వచ్చాట్ట! ఓ వారం దాకా ఇక్కడే ఉంటాడట.

"వస్తానండి!... మళ్ళీ రేపొస్తాను... అమ్మగారికి వచ్చానని చెప్పండి... అక్కణ్ణించి కదులుతూ అన్నాడు.

అతను గదిదాటి వెళ్ళబోతుంటే అంది...

"అమ్మ అడిగితే... ఏమని చెప్పాలి?..." నేరుగా అతని పేరడగలేక అలా అంది.

అతను చిరునవ్వుతో ఆమె వైపు చూస్తూ అన్నాడు...

"కిరణ్ వచ్చివెళ్ళాడని చెప్పండి!..."

ఆమె సందేహంగా అలాగే నిలబడ్డంతో మళ్ళీ ఇలా అన్నాడు "రామాపురం పరంధామయ్యగారి తాలూకు అని చెప్పండి!..."

ఆమె బదులుగా నవ్వుతూ సరేనని తల ఊపింది.

అతను వాకిలి దాటి కనుమరుగయేంతవరకూ అలాగే చూస్తూ నిలబడింది.

* * *

అతను మరుసటి రోజు మర్చిపోకుండా మళ్ళీ వచ్చాడు. అతన్ని అల్లంత దూరం నుండి చూడగానే గుర్తుపట్టింది. కంగారుగా తల్లి గదిలోకి వెళ్ళి అతను వస్తున్నట్లు చెప్పింది. స్వరూపిణి రాత్రి నుండీ అతని గురించే ఆలోచిస్తూ పడుకుంది. అంతరాత్మతో వాగ్వివాదం చేసిన మూలాన నిద్ర కరువై కళ్ళు ఎర్రబడ్డాయి. కూతురి భవిష్యత్తు ఇప్పుడు తన చేతుల్లో ఉంది. అందుకే ఎడతెగని ఆలోచనల్లో చిక్కుకుని చివరికో నిర్ణయానికి రాగలిగింది. అతను వచ్చాడని తెలియగానే సంతృప్తిగా నిట్టూర్చింది.

స్వరూపిణిని చూసి గుమ్మంలోనే బొమ్మలా నిలబడి పోయాడు. సిగ్గు, బిడియం, వినయం, విధేయత ముప్పిరి గొనడంతో చేతులు జోడించి నమస్కరించాడే తప్ప దగ్గరకు రాలేకపోయాడు. అతని రూపం స్పష్టంగా కనిపించకపోవడంతో దగ్గరకు రమ్మని సైగ చేసింది. అతను ఆమెను సమీపించగానే వాత్సల్యంతో అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. ఓ క్షణం అతని వంక పరిశీలనగా చూసింది. పలకరింపులయాక ఇలా అంది..

"తెలుసు బాబు!.. ఏదో ఒకరోజు నువ్వొస్తావని నాకు తెలుసు! పిచ్చి పిల్ల తనే నమ్మలేదు ఇంతకాలం! బిందు రాసిన ఉత్తరాలన్నీ అందాయా బాబు?..."

అతను అయోమయంగా బిందువైపు చూశాడు. స్వరూపిణి తనను చూసి ఎవరనుకుంటుందో అతని కర్థం కాలేదు. బిందూ నొసలు ముడివేస్తూ తల్లివేపు చూసింది. తల్లి ప్రవర్తన ఆమెకు అర్థంకాలేదు. వయసు ముదిరితే చాదస్తం పెరుగుతుందనుకుంటూ! బిందు అతనెవరైంది తల్లి చెవిలో బోధపర్చినా ఆమె వినేస్థితిలో లేదు. తన ధోరణేమిటో తనే!



నడక

"నాన్న! ఇవాళ బస్సులు లేవు! అయిదు కిలోమీటర్లు నడవాల్సి వచ్చింది!"

"ఓరిభడవా... అయిదు కిలోమీటర్లు నడిచావా... చెప్పులు అరిగిపోలేదురా...?"

"నేనంత పిచ్చివాడ్ననుకొన్నావా నాన్నా? చెప్పులు తీసి చెత్తో పట్టకొని నడిచాను!"

—గురు

"బిందు కన్యాయం చెయ్యనని నాకు తెలుసుబాబు! అదే.. ఆయనతో అన్నాను... ఆయన వినిపించుకుంటేనా?... పరువు కోసం ప్రాణం కూడా లెక్కచేయని మనిషి... ఇన్నేళ్ళ ప్రతిష్ట గంగపాలయిందన్న బెంగతో మమ్మల్ని దిక్కులేని వాళ్ళనుచేసి వెళ్ళిపోయారు... నువ్వు కాస్త ముందొచ్చి ఉంటే ఎంత బావుణ్ణు బాబూ?..." ఉద్విగ్నతతో ఆమె చెప్పుకుపోతూంటే పెదవి విప్పి మాట్లాడలేని స్తబ్దతకు లోనయాడు.

స్వరూపిణి మళ్ళీ అతనితో ఏదో చెప్పబోతూంటే అసహనంగా అరిచింది బిందు.

కూతురి అరుపును పెడచెవిని పెట్టి కళ్ళమ్మట నీళ్ళు కారుతుండగా అతనితో తిరిగి ఇలా అంది. "ఐనా ఇప్పుడు మించిపోయిందేమీ లేదు...రావలసిన సమయానికే వచ్చావ్! ... నా పరిస్థితా రోజుల్లోకొచ్చేసింది... నేను పోతే దిక్కులేనిదై పోతుందేమోనని ఇంత కాలం దిగులుగా ఉండేది... ఇకనాకా బెంగలేదు...." దగ్గా, ఆయాసం జతజేరడంతో ఇక ఆపైన మాట్లాడలేకపోయింది. దీనంగా అతనివైపే చూస్తుండిపోయింది.

తల్లి ఎందుకిలా మాట్లాడుతోందో ఆమెకు మొదట్లో అర్థంకాకపోయినా... తరువాత లీలగా ఆమె అంతరార్థం ఏమిటో అవగాహనయింది. చిరాకుగా తల్లివైపు చూసింది. అతను తనవైపు చూసినప్పుడల్లా సిగ్గుతో కుంచించుకుపోయింది. నేరస్తురాలిలా తల దించేసుకుంది.

ఈ పరిస్థితుల్లో అంతకన్నా మార్గం ఆమెకు తోచలేదు.

స్వరూపిణి తిరిగి ఓపిక తెచ్చుకుని మాట్లాడబోతుంటే విసుక్కుంటూ తల్లిని వారించబోయింది. అతను వద్దని సౌంజ్ఞ చేయడంతో నిస్సహాయంగా చూస్తుండిపోయింది.

"నిజం చెప్పబాబూ!... బిందూని తీసుకువెళ్ళడానికే కదూ... వచ్చిందీ?..." ఆశగా చేయి అతని వైపుకు చాస్తూ అడిగింది.



అతను నిశ్శబ్దంగా ఆమె చేతిలో చేయుంచుతూ ఔనన్నట్లు కళ్ళతో సౌంజ్ఞ చేశాడు. బిందూ అతని ప్రవర్తనకు అప్రతిభురాలై చేష్టలుడిగినదానిలా చూస్తుండిపోయింది.

స్వరూపిణి సంతృప్తిగా కళ్ళు మూసుకుంది.

* * *

ఎక్కడో మామిడి తోపులో కొమ్మల చాటున... ఆకుల మాటున దొంగలా కూర్చుని కమ్మగా కూస్తోంది వసంతకోకిల!

బిందూ కళ్ళు తెరిచింది. చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి.

వగరుబోయిన గొంతుతో అదేపనిగా కూస్తున్న కోయిలను అనుకరిస్తూ తను మరింత కవ్వించేది. కోయిల కూత వింటూ పారవశ్యంపొందేది.

తను యవ్వన ప్రాంగణంలో కదుగుమెట్టిన తరువాత నరేష్ సాహచర్యంలో కూడా అదే పారవశ్యం పొందింది. అతను కూడా వసంతమాసంలో కూసే కోయిల లాంటివాడేనని అప్పట్లో గుర్తించలేకపోయింది. అతని ప్రణయ ధృక్కులు విరితూపులనుకుంది. మిన్నాగులై కాటేస్తాయని గ్రహించలేకపోయింది.

ఆలోచనా తరంగాలపై తేలి ఒడ్డుకు చేరుకుంది. వాస్తవ జగతిలోకొచ్చింది. తల్లి పడుకున్న మంచం దగ్గరకొచ్చి నిలబడింది. తల్లి షూఢంగా నిద్రపోతోంది. ఒళ్ళు వేడిగా ఉందేమోనని యాంత్రికంగానే ఆమె నుదురు మీద చేయ్యివేసి పరీక్షించింది. ఒళ్ళు చల్లగా ఐసు గడ్డలా ఉంది. కంగారుగా ఒళ్ళంతా తడిమింది. నిర్జీవ ప్రతిమలా ఎటుకదిపితే అటు కదిలింది స్వరూపిణి శరీరం. ఆతృతగా గుండెమీద చెవి ఆన్చి వింది. 'కీ' ఇవ్వని గడియారంలా ఆమె గుండె నిశ్చలంగా ఆగిపోయింది.

దుఃఖం పొంగి పొర్లి 'అమ్మా' అని ఆక్రోశించింది. తనను ఏకాకిని చేసి వెళ్ళిపోయిన తల్లి ఆత్మకోసం ఎన్నిసార్లలా అరిచిందో ఆమెకే తెలీదు.

"మంచాన్ని అంటిపెట్టుకుని చావుకోసం ఎదురు చూస్తున్న నేను నీకేం చేయగలను?..." తల్లి మాటలు ఆమె చెవుల్లో ప్రతిధ్వనించాయి.

అందుకే కాబోలు తనకోసం అతనితో చిన్న అబద్ధం ఆడింది.

"వేయి అబద్ధాలాడి ఓ పెళ్ళి చెయ్యమన్నారు... నేను నీ కోసం ఒకే ఒక్క అబద్ధం ఆడాను... తప్పాతల్లీ?" తల్లి వదనం తనను ప్రశ్నిస్తున్నట్లనిపించింది.

ఆర్తి నిండిన కళ్ళతో తల్లి రూపాన్ని అపురూపంగా చూసుకుంది. చేతులతో ఒళ్ళంతా ప్రేమగా తడిమింది. తల్లి ముఖాన్ని ఒళ్ళోకి తీసుకుని తనివిదీరా ముద్దులు పెట్టుకుంది. తన కన్నీళ్ళతో తల్లిని అభిషేకం చేసింది.

ఆమె కేకలు విని ఇరుగు పొరుగు జనం ఇంట్లోకి జొరబడి ప్రేక్షకుల్లా చూస్తూ నిలబడ్డారు. తోటి స్నేహితురాళ్ళు బిందూను ఆమెతల్లి నుండి వేరు చేశారు... బిందూ పసిపిల్లలా ఎక్కెక్కి పడుతూ ఏడుస్తూంటే ఆమెను ఓదార్చాలని ప్రయత్నించారు.

కబురంపగానే ఆత్మ బంధువులా ప్రత్యక్షమయాడు కిరణ్. కర్మకాండలన్నీ అతనే దగ్గరుండి జరిపాడు. అలా తన రుణం తీర్చుకున్నాడు. దుఃఖంలో బిందూకు బాసటగా నిలిచాడు. ధైర్యం నూరిపోశాడు.

ఆమె కోలుకున్న తరువాత ఓ రోజడిగాడు. తను వచ్చినపని ఐపోయినట్లు ఒంటరిగా ఇక్కడెందుకు తనతో వచ్చేయమని!

ఆమె బదులు పలుకలేదు. మౌనంగా అలాగే నిలబడిపోయింది. తనూ ఎటూ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది అతను పిలిచాడని సంతోషంగా అతని కూడా వెళ్ళిపోవాలా? అతనేమిటో అతని మనసేమిటో తెలుసుకోనఖ్ఖర్లేదా? ఒకవేళ తెలిసినా అందుకు తానర్హురాలేనా?

"మీ నిర్ణయం ఏమిటో తెలీకుండా నేనెలా వెళ్ళగలను?.." అతని కళ్ళల్లో నిజాయితీ కనిపించింది. తన తల్లి కిచ్చిన మాటను నిలబెట్టుకోవాలనే తాపత్రయం అతనిలో కనిపించింది.

ఆమె చివరికో నిర్ణయానికొచ్చి ఇలా అంది "నా కష్టాల్లో పాలుపంచుకున్నారు నాకు తోడుగా నిలిచారు... ఇప్పటికే మీకెంతో రుణపడ్డాను... ఇంకా రుణం పెంచుకోలేను..." సగంలో ఆగి అతని వైపు చూస్తూ అంది. "మిమ్మల్ని మర్చిపోలేను... మీరు గుర్తుకొచ్చినప్పుడు తప్పకుండా మీ ఇంటికొస్తాను.." కృతజ్ఞత నిండిన కళ్లతో చూసింది.

"మీ ఇష్టం!... మీకోసం మాఇంటి తలుపులెప్పుడూ తెరిచి ఉంటాయి!..." గాఢంగా నిట్టూర్చి పర్సులోంచి తన చిరునామా తెలిపే కార్డును ఆమె చేతికిచ్చాడు. ఆమె చేతికి డబ్బుకూడా ఇవ్వబోయాడు. ఆమె తీసుకోలేదు.

అతను వెళుతూంటే కనుమరగయేంత వరకూ తనివిదీరా చూసింది. ఎందుకో అసంకల్పితంగానే ఆమె కళ్ళు చెమర్చాయి. ఈ నాలుగు రోజుల్లోనే అతనెంతో దగ్గరయాడు. ఓ ఆత్మీయుడు తనను ఒంటరిగా వదిలి వెళ్ళిపోతున్నట్లుగా భ్రాంతి కలిగింది.

* * *

కాలింగ్ బెల్ మ్రోగగానే తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా కిరణ్ ప్రత్యక్షమయాడు.

"అరే!?... మీరొస్తున్నట్లు ఓ కార్డుముక్క పారేస్తే స్టేషనుకు వచ్చేవాణ్ణిగా?... ఎంత ఇబ్బంది పడ్డారో ఏమో?... చిరునవ్వుతో పలకరిస్తూ బిందూను లోపలికి తీసుకువెళ్ళాడు.

"స్టేట్ బ్యాంక్‌లో ఇంటర్వ్యూ వచ్చింది.. ఎలాగో ఈ ఊరొచ్చాను కదా. మిమ్మల్ని చూడాలనిపించి వచ్చేశాను.." అతని వెనుకే నడుస్తూ అంది.

"గుడ్! ఉద్యోగస్తులై పోతున్నారన్నమాట! కంగ్రాచ్యులేషన్స్!..." సీలింగ్ ఫాన్ ఆన్ చేస్తూ అన్నాడు.

"ఏదీ... ఇంటర్వ్యూయే కదా?!... ఉద్యోగం వచ్చేదీ రానిదీ... మరో నెల రోజుల్లో తెలుస్తుంది!..." కుర్చీలో ఒద్దికగా కూర్చుంటు అంది.

"మీకు ఉద్యోగం తప్పక వస్తుందని... నా సిక్త్‌సెన్స్ చెబుతోంది!..."

"ఐతే తప్పదంటారు!?..." వ్యంగ్యంగా ఆమె అంటుంటే అతనికి నవ్వు ముందుకొచ్చింది. నవ్వుతూనే



### చివరిది

"కొత్త దువ్వెన కొనాలిరా?"


"ఏం... ఎందుకు"

"దువ్వెన పన్ను విరిగిపోయింది!"

"ఒక్కపన్నుకే కొత్తది కొంటావా?"

"అబ్బే... ఇప్పుడు విరిగింది దువ్వెన చివరి పన్ను నాయనా!" చల్లగా బదులిచ్చాడు ఆ పెద్ద మనిషి.

—గురు



లేచి లోపలికి వెళ్ళాడు ఆమె పరిష్మన్ అడిగి.

ఏం తోచక పీపాయ్ మీదున్న మేగజైన్ అందుకుని పేజీలు తిరగేసింది. ఏదో అలికిడై ప్రక్కకు తల త్రిప్పి చూసింది. ఐదేళ్ళ కుర్రాడు తననే తదేకంగా చూస్తూ నిలబడ్డాడు ఎవరీ క్రొత్త వ్యక్తని?

బొద్దుగా ఉండి ముద్దొస్తున్నాడు. పేరేమిటని అడిగింది. అతను బదులు పలకలేదు.... సిగ్గు ముంచుకొచ్చిందేమో లోపలకు తుర్రుమన్నాడు.

కిరణ్ లోపలి నుండి వచ్చి కుర్చీలో కూర్చుంటూ అన్నాడు "వట్టి అల్లరి పిడుగు... మీకేమైనా ఇబ్బంది కలిగించాడా"?

ఆమె నొసలు చిట్లించి చూస్తూ అంది "ఎవరి గురించి మీరంటున్నది?...."

"అదే బబ్లూ... ఇప్పుడు మీదగ్గర కొచ్చినటు ల్లాన్నాడుగా?..."

"ఓహ్! ఆ బాబు గురించా మీరనేది?... ఎవరి బాబు చాలా ముద్దొస్తున్నాడు?..."

అతను సమాధానం చెప్పలేదు. చూపులు మరల్చాడు. ముందున్నంత కలుపుగోలు తనం అతనిలో కనిపించలేదు. ఏదో చెప్పడానికి బిడియపడుతున్నవాడిలా ఉందతని అవ తారం.

అతనితో ఏదో మాట్లాడాలని తలఎత్తిన ఆమె అలాగే కళ్ళు మరింత వెడల్పుచేసి చూస్తుండిపోయింది.

ఇంచుమించు తనతోటి ఈడున్న అమ్మాయి చేతిలో 'ట్రే'తో దర్శనమిచ్చింది. వస్తూనే పలకరింపుగా నవ్వింది.

"శైలూ!... మా మాష్టారు గారమ్మాయని చెప్పానే!... ఆవిడే ఈవిడ... పేరు బిందు మాధవి.... స్టేట్ బ్యాంక్‌లో ఇంటర్వ్యూ వచ్చిందట!..." ఒకరినొకరికి పరిచయం చేశాడు.

శైలజ ట్రేలోని కాఫీ కప్పు బిందూ చేతికందిస్తూ అంది "ఒంటరిగా అక్కడెందుకున్నారు?... ఇక్కడికొచ్చేయాల్సింది..."

తన వ్యక్తిగత విషయం అడిగేప్పటికి బిందూ సిగ్గుపడి మారు మాట్లాడలేకపోయింది. పలకరింపుగా నవ్వి కాఫీ కప్పును అందుకుంది.

ముగ్గురూ కూర్చుని కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నారు. కబుర్లలో సమయం ఎంతయిందో కూడా గుర్తించలేనంతగా మునిగిపోయారు. బిందు తిరుగు ప్రయాణానికి సిద్ధమౌతుంటే ఆ రోజుకక్కడే ఉండిపొమ్మని బ్రతిమిలాడారు. బిందు తన అసక్తతను వ్యక్తబరిచింది.

పనుండి భార్య లోపలికి వెళ్ళడం చూసి అతను బిందూతో అన్నాడు "సారీ!... అప్పటి పరిస్థితిలో మీ అమ్మగారికి నిజం చెప్పలేకపోయాను... అమ్మగారి అత్మ సంతృప్తికోసం అలా నటించాల్సి వచ్చింది... ఆ ప్రయత్నంలో మీ మనసుకాని గాయపరిచానేమో"

అతని గొంతు బొంగురుపోవడం ఆమె గమనించి ఇలా అంది "ఎందుకలా గిల్టీగా ఫీలవుతున్నారు?... ఒక చిన్న అబద్ధంతో మా అమ్మ ఆత్మకు శాంతి కలిగించారు... నిజంగా మీకెంతో ఋణపడివున్నాను. తెలియని ఉద్వేగం గొంతులో అడ్డుపడి ఆపైన ఆమెను మాట్లాడనివ్వలేదు.

సందు మలుపు తిరగబోతూ వెనక్కి తిరిగి చూసింది. శైలజ బాబు నెత్తుకుని తన వైపే ఆత్మీయతగా చూస్తూ వీడ్కోలు తెబుతోంది! కిరణ్ పరిస్థితీ అలాగే ఉంది. యాంత్రికంగా వెయ్యి ఊపు తున్నాడు. బబ్లూ 'ఆంటీ' అని అరుస్తూ చేయి అటూ—ఇటూ ఆడిస్తున్నాడు. బిందూ కళ్ళలో తడిచేరిన మూలాన వాళ్ళ రూపాలు అలికినట్లుగా ఉన్నాయి. భారంగా నిట్టూరుస్తూ సందు మలుపు తిరిగింది.

ఎక్కడో చెట్ల గుబుర్లలో దాగిన కోయిల కమ్మగా కూస్తూ వసంతరాగాన్ని వినిపిస్తోంది. *



### పెళ్ళిరోజు

భర్త: మన పెళ్ళి రోజు నీకు గుర్తుండదు! కావాలంటే పందెం కడ్తా!

భార్య: అంత 'చెడు' రోజును ఎలా గుర్తుంచుకోమంటారండీ?

భర్త: ఆ...

భార్య: అవునండీ! ఆరోజున్నే కదా మా కుక్క చచ్చిపోయింది!

—గురు

